అతను నా రెండు భుజాలమీద చేతులు వేసి నా ముఖంలోకి రెప్ప వాల్చకుండా చూశాడు. ఆ చూపుకి తట్టుకోలేక నేను కళ్ళు మూసుకున్నాను. అలా మేము ఎంతసేపు ఉన్నామో నాకు తెలియదు అతడు నా రెండు కన్నులమీద దీర్ఘమయిన ముద్దులు పెట్టుకున్నాడు. ఆ ముద్దులతో నాకు తెలివి వచ్చింది. కన్నులు తెరచిచూచాను. తెలతెలవారుతోంది. నేను అతని చేతులు నా భుజములమీదనుంచి మెల్లిగా తీస్తూ అన్నాను: "మన స్టేషనింక అర గంటలో వస్తుంది."

దంతధావనం ముగించి కూర్చున్నాం. అతని తువాలు మాసి ఉండడంచేత నా తెల్లని తువాలు అతనికిచ్చాను. అతడు దానితో ముఖముతుడుచుకుని తన పెట్టెలో పెట్టుకున్నాడు పరధ్యాన్నంగా. అతనిదగ్గర దువ్వెన అద్దం కూడా లేవు. అతని తలకి నూనెరాసి సావకాశంగా తల దువ్వాను. ఎన్ని సంవత్సరాలనుంచో కలిసిఉన్న మిత్రులలాగ మే మొకరికొకరు సాయం చేసుకున్నాము. మా బెడ్డింగులు రాత్రి విప్పకపోవడంచేత వాటిని కట్టనవసరం లేకపోయింది. రఘుపతి పైకి చూసి "నీ పెట్టె తాళంవెయ్యడం మరిచిపోయావు గిరిజా" అన్నాడు. "మరిచిపోలేదు పనుం"దంటూ నేను పెట్టెతీసి శాలువా పైకితీసి వీపుపైన కప్పుకున్నాను. అతను నావైపు తత్తరపడి చూశాడు. తమాయించుకుని అన్నాడు "ఈ ఊదా సిల్కుచీరమీద, ఈ ఆకుపచ్చ శాలువ ఎంతో బాగుందిసుమా!" "మరి నేనో" అన్నాను చిరునవ్వుతూ. "నువ్వా, నువ్వు నిజంగా మనోరమకన్నా ఎంతో చక్కగా ఉన్నావు" ప్రతి స్త్రీ ఏ మాటలు తను ప్రేమించినపురుషుని నోటినుండి, ఒక్కసారికాదు, వందసారులైనా వినాలని కుతూహలపడుతుందో ఆ మాటలు వీనులవిందుగా నా చెవిని పడ్డాయి. నా మనస్సానందంతో ఉప్పొంగిపోయింది. నేను ఆ శాలువమీదనున్న లేబులు అతనికి చూపెట్టాను. అతను ఆశ్చర్యంతో నావైపుచూచాడు. రాత్రి నేనుచేసిన పని అతనికి చెప్పాను. అతను ఆనందాతిరేకంతో నా చేతిని పైకెత్తి తిరిగి ముద్దుపెట్టుకున్నాడు.

అంతలో రైలు ఏలూరు స్టేషనులో ఆగింది.

# నమ్మలేని నగ్నసత్యాలు

యం. హీరాలాల్ రాయ్

వీధిగదిలో కూర్చుని యివాళటి ముఖ్యవార్తల్ని ఎడిట్ చేసుకుంటున్నాను. ఎక్కణ్ణించో తుపాను వరవడితో వచ్చిపడింది విద్యార్థిబృందం నన్ను వెదుక్కుంటు గదిలోకి. వాళ్ళచేతుల్లో బూంధీ, కారప్పూస, స్వీటుమొదలైన హోటలు తినుబండారాల పొట్లాలున్నాయి. మరోమాట లేకుండా వాటిని నాముందువిప్పి "కొంచెంవీటిని రుచిచూడండి మహాశయా!" అన్నారు.

"క్షమించండి! కడుపునిండా అన్నంతిని కూర్చున్నా. మరెప్పుడన్నా తింటాను" అన్నాను.

"అలా కాదు...తిని తీరాలి" అని పట్టుబట్టారు వాళ్ళు. వాళ్ళ యీ అభ్యర్థనని నేను కాదనలేక పోయాను. కాదన్నా వదిలేట్టులేరు. తప్పని సరిగా కొంచెం రుచిచూశాను. స్వీట్సు సహజంగా తీయగానే ఉన్నాయి రుచికి. కాని పిండి మాత్రం కత్తీది జాస్తిగాఉంది...కొంచెం కారా నమిలాను...అలా పూర్తిగా ఇంక నమిలానో లేదో...నాకు వాంతివస్తున్నట్టనిపించింది. ఆశ్చర్యంతో దాన్ని వాసచూశాను...ఛ...ఛ.. కుళ్ళిపోయిన కొబ్బరివాసన వేసింది గప్పున. ఏదో ఓ ప్రత్యేకమైన నూనెతో దీన్ని తయారు చేశారల్లేవుంది. నా ఘ్రాణేంద్రియం ఆ దుర్వాసనతో కుళ్ళిపోయినట్టనిపించి. అదితెచ్చిపెట్టి; తినమన్నందుకు వాళ్ళని విసుక్కుంటూ, త్వరగా లోపలికెళ్ళి పుక్కిలించి ఉమ్మేసి, ఇన్ని ద్రాక్షపళ్ళు నమిలాను...అప్పటికి నా ప్రాణాల కుదుటపడింది.

"క్షమించండి మహాశయా! మావల్ల మీరు చాలా హైరానపడ్డారు...ఇవన్నీ ఎక్కడి

వసుకున్నారో తెలుసా?... ఈ పట్టణంలోగల గొప్ప గొప్ప హోటళ్ళలో మాలాంటివాళ్ళకు విపరీతమైన ధరలకు దొరుకుతున్న భోజ పదార్థాలు యివండీ!" అన్నారు... నా కాశ్చర్యం వేసింది.

"మీ పత్రికా విలేఖరులు ఇలాంటి సాధారణ విషయాల్ని అసలు పట్టించుకోరు... మా కర్మ... మంత్రుల పర్యటనని గురించీ, వాళ్ళ డబ్బా ఉపన్యాసాల్ని గురించీ బ్రహ్మాండమైన పబ్లిసిటీ ఇస్తారు. కాని ఇలా మమ్మల్ని దోచే యీ చీకటిమొహాల్ని గురించి కలం నడవదు... యిదంతా యేవిటంటారు?" అన్నారు విద్యార్థులు కోటిగొంతుల ధ్వనితో.

ఇక యిలాంటి విషయాల్ని గురించి తప్పక పత్రికల్లో వ్రాస్తానని వాళ్ళకి వాగ్దానంచేసిన తరువాతగాని వాళ్ళనుంచి బయట పళ్ళేక పోయాను.

నిజంగా వాళ్ళుతెచ్చిన ఆ తినుబండారాల సరుకంతా నాకు మహా అసహ్యంగా, భయంకరంగా కన్పించింది... వాటిని తల్చుకుంటే మళ్ళీ వాంతి వచ్చేస్తోంది... మనుషుల శ్రమశక్తిని అణా పైసల్తో లెక్కగట్టి తీసుకుంటూ, యీ హోటలువాళ్లు ఇలాంటి కుళ్ళుసరుకుని నెత్తిన రుద్దడం ఎంతదగా...? రోగాలు యిక వదలమంటే యెలా వదుల్తాయి...? అమూల్యమైన జీవితంలో సగంకాలం హోటళ్ళకీ, తరువాత డాక్టర్లకి అర్పణంఅవుతోంది. చూస్తూచూస్తూండగానే వీధిలో చాలామంది మాట్లాడుతున్న ధ్వని వినవచ్చింది. వాళ్ళేదో అమ్ముతున్నట్టుంది.

"పిల్లుల్నీ, ఎలకన్నీ, కుక్కపిల్లల్నీ యిచ్చి యీ తాయెత్తుల్ని కొనండి!" అంటూ అమ్ముతున్నారు వాళ్లు. నా గదిముందుగా వాళ్లెళ్ళిపోతున్నారు.

తాయెత్తులు; కుక్కలు, పిల్లులూవుంటే ఇచ్చి తీసుకోవడమేమిటో నాకర్థంకాక ఆశ్చర్యంతో బయటికి వచ్చాను అసలువిషయం తెలుసుకుందామని. వాళ్ళతట్టల్లో కాళ్ళుచేతులూ కట్టి పడేసిన పిల్లులూ, కుక్కపిల్లలూ చాలా వున్నాయి. నాకు వాళ్ళని ప్రశ్నించాలనిపించి "ఈ కుక్కల్నీ, పిల్లుల్ని ఏంచేస్తారేమిటి? నా దగ్గర చాలాకుక్కలున్నాయి. తీసుకుంటారా" అన్నాను.

"మీరన్ని కాల్తీలిస్తే అన్నితాయెత్తుల్ని మీకు మేమిస్తాం" అన్నాడందులో ఒకడు. ఇంకా కావాలంటే మీకు బలాన్ని యౌవనాన్ని కూడా కల్పించే మహత్యంగల వున్నాయి. ఆ తాయెత్తుల్ని ధరించేమాటుంటే మీకు తేళ్ళూ పాములభయం వుండదు... ఒక్కసారి వాడారంటే అంతటా మీదే పైచేయి" అన్నాడు.

అసలు సంగతి వీళ్ళిలా చెప్పేట్టు లేరని, వాళ్ళల్లో ఒక్కణ్ణిపిలిచి, నాగదిలోకి తీసుకెళ్ళి రహస్యంగా వాడిచేతిలో రూపాయినోటుంచిస్తూ "నిజంచెప్పవోయ్! 'మీరు వీట్ని ఏంచేస్తారు?" అన్నాను. కొన్నినిముషాల్లోనే అతడు నాస్నేహితుడైపోయాడు.

"నిజం చెప్పమంటారా?... కోప్పడకండి. ఈ కుక్కలూ, పిల్లులవల్లే మాబతుకులు నిలబెడుతున్నాయి... అవే మా కాహారం అంటే మీరు నమ్మరు. పొలాలుగానీ, కొంపలుగానిలేని దేశద్రిమ్మరులం .. ఇంతకంటే మాకువేరికే ఆహారమంటూ లేదు". అసలేదీ...?

అతను ప్రశ్నార్థకంగాపెట్టిన ముఖానికి నేనేం జవాబివ్వాలో తెలియలేదు. అతనింకా చెబుతూ పోతున్నాడు.

"పట్టణాల్లో నా మాకు పనికొరకదు ... 'భూములు లేనివాళ్ళకి భూములిస్తాం' అని ప్రభుత్వం ప్రకటిస్తుందేకాని, ఎన్నివందలసార్లు మనవులు చేసినా అతీగతీవుండదు. చేసినఒక్కొక్కమనిషికీ ప్రపంచంచుట్టివచ్చినంత పైరవీచేయాలి. అలా చేయాలంటే ఎంతడబ్బవసరమో మీకు తెలీందికాదు. హుం... నిజం మాటాడితే మాదీ ఒక జీవితంకింద లెక్కేనా? మోటుబతుకులు... మామీద విరుచుకుపడే అత్యాచారాలనిచూసి, చేసేదేమీలేక నవ్వడంతప్ప మరేమికనపడదు. ఇంకా పచ్చినిజం చెప్పాల్సివస్తే; మేం తిరుగుతున్న శవాలం బాబూ!"

ఇలా అతను చెప్పుకుపోతుంటే అతనికళ్లవెంట రాలే కన్నీళ్ళతోపాటు నా కళ్లుకూడా చెమ్మగిల్లాయి.

"ఆకలి మంటను మీ రెప్పుడూ రుచిచూచి వుండరుబాబూ! ఆ సమయంలో తండ్రీతండ్రీగా, తల్లులు తల్లులుగా వుండలేరు. మనిషై పుట్టినప్పటికీ మనిషినన్నా తిని ఆకలితీర్చుకోవాలనిపిస్తుంది. అడ్డమైె గడ్డితినే మావెంటపడి తరిమే జబ్బుల కోసరం మందూమాకులు ఈ భూమ్మీదలభించవు. మా వ్యాధులుకూడా చిత్రంగా భయంకరంగా వుంటాయి. ఈ జబ్బుశరీరాల్తోటే మా భుజాలు మా యిళ్ళనీ, సంసారాన్నీ మోసుకుతిరుగుతుంటాయి... ఎక్కడాగితే అక్కడే యిల్లూ, వాకిలి...పట్టణాల్లో తిరుగుతున్నప్పుడు ఏవిధంగానో మా ఆడవాళ్లు సంపాదించుకొనివచ్చే అవకాశాలు తరుచుగా లభిస్తూంటాయి ఒక్క పట్టణంలో కనీసం పదేసిరోజులన్నా మమ్మలి వుండనీయరు. చూశారూ. ఇంకో విచిత్రం...? ఒక్కోసారి యీ కుక్కలూ, పిల్లులూకూడా మాకు సరిపోయినన్ని దొరకవు. అప్పుడు పాముల్ని పట్టుకొని చంపి తింటాం...అలా ఆశ్చర్యపడతారేం? మీకిది కొత్తకావచ్చు...వాటిని పట్టుకోవడం, తినడం ఎంత క్షేమకరమైన పనంటారు? ఈ విషపురుగులకన్నా పిల్లులూ, కుక్కలే నయమనిపిస్తాయి ... చవగ్గా దొరుకుతాయి. ఏమంటారు?"

అతడు ప్రశ్నార్థంగా నావేపు చూశాడు.

రానురాను అత్యంత భయంకరాంధకారంలో పడిపోయే మానవ జీవిత భవిత్యంలో ఎప్పుడున్నా వెలుగు ప్రవేశిస్తుందా అనే సంశయం మిగిలింది నాకు. ఈ వ్యక్తి ప్రతిమాటులో నాకు కొత్తదనంతో కూడిన నగ్నసత్యం స్ఫురించిన మాట నిజం ... అగ్రజాతులూ, నీచజాతులూ నేరస్థజాతులూ నని నిరూపించినవారిలో ఇవాళకూడా పాముల్నీ, యెలుకల్నీ, పిల్లుల్నీ తినేవారున్నారనేది విదితం. కాని, ఈ రోజుల్లో అది సామాన్య మానవులకి కూడా తటస్థపడిందంటే నమ్మకంలేకున్నా నమ్మలేకుండా వుండలేకపోయా మనిషి వాలకం చూసి.

ఉన్నత విద్యాభ్యాసంచేసి ఉద్యోగాలు దొరక్క పట్టణాల వీధుల్లో పచార్లుచేసే నిరుద్యోగులు వేలాది కనిపిస్తారు. వాళ్ళల్లో కొంతమందికి జీవితంమీద విసుగెత్తి ఆత్మహత్యలు చేసుకోవడం కూడా కళ్లారా చూస్తున్నాం. కాని, ఈ పట్టణాల కవతల చాలాదూరంలో పల్లెల్లో నివసించే లక్షలాది మానవకంకాళాలు తిండిలేక పాములూ, పిల్లులూ, కుక్కల్నీ తిని బతకలేక బతుకుతున్నారని ఇవాళే తెలిసింది. నన్ను చూస్తే నాకే అసహ్యం వేసదెందుకో. ఇక వినలేకపోయాను. "ఆపుచేయవోయ్ నీకథ... ఇంకా ముందుకుపోకు" అంటూ పెద్దగా అరిచాను.

నాకూడా అప్పుడప్పుడు ఉపవాసాలుండాల్సిన స్థితి లభిస్తుంది. ఏ కారణంవల్లనైనా అలా వుండాల్సి వచ్చినపుడు, ఆకలిబాధ ఏలాంటిదో కూడా తెలుస్తుంది. మెదడు ఖరాబై అల్లరి చేస్తుంటుంది...కలం నిప్పులు రాలుస్తుంది. కాని, అలా ఆకలైనపుడు విషసర్పాల్నీ, కుక్కల్నీ, పిల్లుల్నీ కూడా తినవచ్చునని మాత్రం నా కింతవరకు తోచనేలేదు.

మా పట్టణంలో వుండే భారత సేవక సమాజీయుల దగ్గర్నించీ, ప్రజా సహాకారకకర్తలమని చెప్పుకుతిరిగే ప్రతి వ్యక్తి పత్రికల్లో తన పేరు ఆయాచితంగా పెద్ద అక్షరాల్లో అచ్చుపడాలని అటుమటిస్తారేకాని, విషంమింగిమరణించే,క్రిమికటకాలకన్నా హీనంగా జీవించే మనుషుల గొడవే పట్టించుకోరు...ఈ ప్రజాసేవకులు, మానవుడి శవాన్ని తగలేయడానికి అణా, కేవలం ఒక్క అణా ధర్మంచేయడాని కూడా ఏడుస్తారు. కాని అక్రమంగా సంపాదించుకోదలచిన కీర్తి ప్రతిష్టల కోసం అన్యాయార్జిత విత్తాన్ని వేలకువేలు కుమ్మరించడానికి తయారవుతారు. అయితే ప్రజాసేవ పేరుతో ప్రొద్దస్తమానం విందులూ, వినోదాలూ అనుభవించేవీళ్ళానవయుగనిర్మాతలు? లేక,పిల్లుల్ని కుక్కల్ని తినే యీ అడవిమనుష్య లనుకుంటున్న వాళ్ళా యుగాధారులు? కాలం నిర్ణయించాలి.

"నేనిక వెళ్ళిపోతాను బాబూ!" అంటూ నా యెదుటువున్న మనిషి నవ్వుతూ అన్నాడు.

అతని పెదవులు కదుల్తున్నాయి.

"బహుశా నా మాటలు మీకు అసహ్యంగా విపరీతంగా తోచిన వనుకుంటాను?" అంటూ మళ్ళీ నవ్వాడు.

ఆ నవ్వులో నాకు అదోరకమైన వింతశక్తి, పట్టుదలా గోచరించింది. జీవితంతో సాగే పోరాటం కనిపిస్తుంది..."మేం యింకెంతో కాలం ఈ జీవితాన్ని భరించలేం...ఈ దుర్భరావస్థనుంచి విముక్తి పొందాలి. ఈ నూతన సాత్విక తత్వం ఒక పోరాటమై విజృంభించి, నిరాటంకంగా తనకు అర్హమైన దశకి చేరుకోకతప్పదు. ఏదో ఒక అసాధారణ శక్తి ఈ సాత్విక యుద్ధానికి ఆచరణ అనే మొగ్గల్ని తొడిగిస్తుంది. మానవుణ్ణి మృత్యువులోంచి రక్షించలేరనేది ఎంత బలీయమైన సత్యమో, పరిణామాన్ని ఆపలేరనదంకూడా అంత సహజసత్యం" అన్న ధ్వని ఆ నవ్వులో వినపడుతూంది.

ఆలోచనతో నేనలా చూస్తుండగానే ఆ వ్యక్తి వెళ్లిపోయాడు.

ఇవాళ్టి ఈ ప్రపంచం ఓ పెద్ద వేలంపాట దుకాణంలాంటిది. ఇక్కడ సంస్కృతి, సత్యం, నీతి నియమాలు అన్నీ వేలం అవుతాయి. ప్రైజరీల్లో దాక్కుంటాయి. అలా ఒకళ్ళ యాజమాన్యంలో చిమ్మచీకట్లో బంధింపబడడానికి వీల్లేని శక్తిగల సంస్కృతీ సత్యాలు ఎప్పుడు ఎవ్వాళ్ళకి ఉద్భవిస్తాయి? మనిషి బతకడానికి మాయదారి పాముల్ని తినాల్సిన అవసరంలేని రోజు లెప్పుడు...? దరిద్రదశలోవుండే యువతుల్ని నగ్నంగాచేసి, తొడలమీద కూర్చోబెట్టుకొని వాళ్ళ బలహీనతతో ఫలితాన్ననుభవించడానికి యత్నించే ఈ నీతివంతుల చర్యలకి బ్రేక్ పడే దెప్పుడు?

ఇవాళ ఈ దేశంలో ఒక సామాన్య యువతి శీలం విలువ తక్కువలో తక్కువ నాలుగణాలు, గరిష్టమూల్యం ఐదురూపాయలు. కాని, అందమైన ఒక బూట్లజత ఖరీదు మాత్రం పాతిక రూపాయలవరకుంటుంది...ఎర్రని వైన్ బాటిల్ మొదలైన వాటి మూల్యం ఇంకా నలభైరూపాయలదాకా వుండి తీరుతుంది...అసహ్యకరమైన యీ భయంకర పరిహాసావస్థకి అంతం యెన్నడు?

సస్యశ్యామలమైన పంట పొలం యెలా చిరజీవితాన్ని కలిగివుందో అలానే మానవత్వం కూడా చిరంజీవి...అమూల్యం...

నేను ఎడిట్ చేసుకోవలసిన వార్తలు అలానే ఉండిపోయాయి. న్యాయమైన అవసరాన్ని గుర్తించాల్సిన అవసరం కన్పిస్తుంది కళ్ళముందు. కాని, ఇవన్నీ వార్తలుగా పరిగణించి, అవసరాలకి ప్రాముఖ్యాన్నిచ్చే ముద్రణయంత్రం యేది అనేది ప్రశ్నగా తయారయింది. మహా ఘనత వహించిన మాఊరి సేట్ జీలు, అర్ధరాత్రివేళ చట్టాలనే కాకుండా, రాష్ట్రసరిహద్దుల్ని అతిక్రమించి ధాన్యం ఎగుమతులు చేస్తుంటారు...నా కళ్ళముందే నేనువెళ్ళే ఆఫీసుల్లో లంచాలబేరాలు సాగుతుంటాయి. "ఫలానాఆఫీసులో లంచాల బాధ భరించలేం" అంటూ యెంతోమంది అనంగా నా చెవులు వింటుంటాయి...ఫలానా ఆఫీసరుగారింటికి ఫలానా కుబేర్రావుగారు నేతి డబ్బాలు, బియ్యం బస్తాలు పంపారు. ..మరో ప్రబుద్ధుడు అధికారిగారి దోస్తీతో అభియోగం రద్దుచేయించుకున్నాడని ప్రత్యక్షసాక్షికథనం... భారతసేవక సమాజంపేరుతో జరిగే కుత్రులకు మోసాలకు అంతూపంతూ లేదు...పాతరోడ్ల మీద తట్టెడు మట్టిచల్లించి, పదివేల రూపాయలతో యీ రోడ్లు తయారైందని, ప్రముఖ మంత్రితో ప్రారంభోత్సవం చేయిస్తారు వీళ్లు సత్రాలూ, బళ్ళూ, గ్రంథాలయాలకి సంకుస్థాపనోత్సవాలు అడుగడుక్కీ చేయిస్తారు. కాని, ఆ కల్పాంతం అవన్నీ అలానే పునాదులు త్రవ్వడంతో నిల్చిపోతాయి.

ఇంకా ఇలాంటి లక్షలాది నగ్నసత్యాలు, వార్తాపత్రికల వాళ్ళకి డబ్బిచ్చినా వేసుకోని ప్రత్యక్ష కథనాలు చిరకాల ఇలానే పొక్కకుండా వుంటాయేమో...నా మనస్సు ఆలోచనల్తో వేడెక్కి పోయింది....భగవంతుడు నాకు ఆలోచనాశక్తినీ, విమర్శనాశక్తినీ ప్రసాదించినందుకు నన్నే నాలుగులిట్టుకుని దేవుణ్ణి లిట్టాలని అనిపిస్తుంది.

---

సమాజంలో ఏ ఒక్క మంచిసంస్కరణ అయినా సరే, కనీసం ఒక్క సింహం, ఒక్కగాడిదా తీవ్రంగా ప్రతిఘటించనిదే అమల్లోకి రాలేదు.—గ్రైటర్‌మన్